GSTIN:36FDKPS1308P1ZX

# టి-మీడియా

సామాజికం ... ప్రజల పక్షం...

epaper,www.tmedia.net.in YouTube facebook

## టీమీడియా, ప్రత్యేక సంచిక







# అదుర్స్

# డ్వాక్రా మహిళా మార్ట్ సక్సెస్

- ⏭ మహిళల ఉత్పత్తుల విక్రయాలకు కేరాఫ్
- ⏭ అమ్మకాలు జబర్దస్త్..!
- ⏭ రోజుకు రూ. 35 వేలు, వీకెండ్ లో రూ. 45 వేలు!
- ⏭ తలచుకుంటే ఏందైనా సాధ్యమేనని నిరూపిస్తున్న మహిళలు
- ⏭ కస్టమర్లు, ప్రజలు నుంచి అభినందనలు
- ⏭ ప్రత్యేక ప్రశంసలు అందజేసిన సీఎం రేవంత్

**డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు మంచి డిమాండ్‌ను సృష్టించి, ఆర్థికంగా వారిని బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రారంభమైన ఖమ్మం మహిళా మార్ట్ అందరి చేత అదుర్స్ అనిపించుకుంటున్నది. రోజుకు రూ. 35 వేలు, వారాంతాల్లో రూ. 45 వేలకు పైగా అమ్మకాలతో దూసుకుపోతున్న ఈ మార్ట్‌ను స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసించటం విశేషం. ఇది కేవలం ఒక వ్యాపార కేంద్రం మాత్రమే కాకుండా, మహిళల ఆత్మవిశ్వాసం, స్వయం సమృద్ధిని పెంచే ఒక వేదికగా నిలిచి కస్టమర్ల మన్ననలు పొందుతోంది.** టీమీడియా ఖమ్మం జిల్లా బ్యూరో



ఖమ్మం జిల్లా వైరా రోడ్డులో 'మేడ్ ఇన్ ఖమ్మం' బ్రాండ్ పేరుతో ప్రారంభమైన ఈ షాపింగ్ మాల్ తరహా మహిళా మార్ట్, డ్వాక్రా మహిళల ఉత్పత్తుల విక్రయాలకు ఒక వేదికగా మారింది. గతంలో తమ ఉత్పత్తులను ఇళ్ల దగ్గర లేదా వారాంతపు సంతల్లో అమ్ముకునే మహిళలకు సరైన మార్కెటింగ్, బ్రాండింగ్ సౌకర్యాలు లేక అమ్మకాలు తక్కువగా ఉండేవి. ఈ సమస్యను గుర్తించిన అప్పటి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, మహిళా సంఘాల ఉత్పత్తులకు ప్రత్యేకంగా ఒక షాపింగ్ మాల్ ఏర్పాటు చేయాలని ఆలోచించారు. ఆ ఆలోచన నుంచి పుట్టిందే ఈ మహిళా మార్ట్.

తక్కువ వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ మార్ట్, మూడు నెలల స్వల్ప కాలంలోనే మంచి విజయం సాధించింది. ప్రస్తుతం జిల్లాలోని 60కి పైగా మహిళా సంఘాలు తయారు చేసిన చిరుధాన్యాల ఉత్పత్తులు, హస్తకళలు, ఆహార పదార్థాలు, సేంద్రీయ వస్తువులు, చేనేత వస్త్రాలు వంటివి ఇక్కడ అమ్ముడవుతున్నాయి. మామూలు రోజుల్లో రూ. 35 వేలకు పైగా, వీకెండ్స్, పండుగలప్పుడు రూ. 45 వేల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. దీంతో, ఈ మార్ట్‌కు సరుకులు సరఫరా చేస్తున్న మహిళా సంఘాలు మరింత ఉత్సాహంగా పనిచేస్తున్నాయి. ఈ మార్ట్‌లో వివిధ రకాల రవ్వలు, పప్పులు, స్నాక్స్, మిల్లెట్స్‌తో తయారు చేసిన వంటకాలు, పిండ్లు, బియ్యం, కొయ్య బొమ్మలు, గిఫ్ట్ ప్యాక్‌లు, జూట్ బ్యాగులు, నేచురల్ సబ్బులు, విత్తనాలు, కలంకారీ వస్త్రాలు, మసాలా టీ పొడి, సేంద్రీయ ఉత్పత్తులు, కోల్డ్ ప్రెస్డ్ నూనెలు, వెదురు ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. గతంలో నెలకు రూ. 10 వేల లోపే సంపాదించిన మహిళలు ఇప్పుడు రూ. 30వేలకు పైనే సంపాదిస్తుండటం విశేషం.



ఖమ్మం మహిళా మార్ట్, మహిళా సంఘాలకు తమ ఉత్పత్తులను మార్కెట్ చేసుకోవడానికి ఒక సరికొత్త మార్గాన్ని చూపించింది. ఈ మార్ట్‌లో కస్టమర్ల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా నాణ్యమైన కొత్త ఉత్పత్తులను తీసుకొస్తున్నారు. స్టోర్‌లో ఉన్న స్టాక్ ఆధారంగా మండల సమాఖ్యల ద్వారా మహిళా సంఘాలకు ఎప్పటికప్పుడు ఆర్డర్లు ఇస్తున్నారు. ఈ మార్ట్‌లో వచ్చే ఆదాయాన్ని జిల్లా సమాఖ్య, మండల సమాఖ్యలు పంచుకొని, నిర్వహణ కార్యకలాపాల కోసం ఉపయోగిస్తున్నాయి. భవిష్యత్తులో ఆదాయం పెరిగితే, మహిళా సంఘాలకు అవసరాన్ని బట్టి అప్పులు ఇవ్వాలని కూడా అధికారులు యోచిస్తున్నారు.

ఖమ్మం మహిళా మార్ట్ విజయంతో, ఇతర జిల్లాల్లోనూ ఇలాంటి మార్ట్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం, అధికారులు ఆలోచనలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఖమ్మం మహిళా మార్ట్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ప్రశంసలు తెలిపారు. ఈ మార్ట్ అనుభవం ఆధారంగా, భవిష్యత్తులో మధిర, సత్తుపల్లి, ఇతర పట్టణాలకు కూడా



మార్ట్‌ను విస్తరించే ప్రణాళికలు ఉన్నాయని ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఇది మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రతిబింబిస్తుంది.

మొత్తంగా, ఖమ్మం మహిళా మార్ట్ కేవలం ఒక వ్యాపార కేంద్రంగా మాత్రమే కాకుండా, మహిళల ఆత్మవిశ్వాసాన్ని, స్వయం సమృద్ధిని పెంచే ఒక వేదికగా నిలిచి ప్రజల ఆదరణను పొందుతోంది. బ్రాండింగ్, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తే తమ ఉత్పత్తులకు ఎంత డిమాండ్ ఉంటుందో మహిళలు నిరూపించారు. ఈ విజయం, ఇతర ప్రాంతాల్లోని మహిళలకు స్ఫూర్తినిస్తోంది.

